క్లుప్తంగా

నేటి నుంచి సర్టిఫికెట్ల వెరిఫికేషన్

సంగారెడ్డి టౌన్: ఇంజనీరింగ్ కాలేజీలలో సీట్ల భర్తీకి సంబంధించిన ఎఫ్ సెట్ క్వాలిఫై అయిన విద్యార్థులకు ఈ నెల 06 నుంచి 11వ తేదీ వరకు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఒరిజినల్ సర్టిఫికెట్లను పరిశీలించనున్నట్లు ప్రిన్సిపాల్ మల్లికార్జున్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆన్‌లైన్‌లో స్లాట్ బుకింగ్ చేసుకున్న విద్యార్థులు పూర్తి ఒరిజినల్ సర్టిఫికెట్లతో సంగారెడ్డి మండల పరిధిలోని ఇస్మాయిల్‌ఖాన్ పేట ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో హాజరు కావాలని సూచించారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం



రక్తదానం చేస్తున్న మహేశ్వర సిద్ధాంతి, సిబ్బంది

సంగారెడ్డి: రక్తదానం మహాదానమని టీజీఐఐసీ చైర్మన్ నిర్మలారెడ్డి, జ్యోతిర్వాస్తు విద్యాపీఠం వ్యవస్థాపకుడు బ్రహ్మశ్రీ డాక్టర్ మహేశ్వరశర్మ సిద్ధాంతి అన్నారు. సాహితీ హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ రాము జన్మదినం సందర్భంగా ఆస్పత్రి ఆవరణలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాము ఆధ్యాత్మిక కార్యక్రమాలతో పాటు సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో సిబ్బంది, సభ్యులు పాల్గొన్నారు.

ఉచిత తాగునీటి సరఫరా అభినందనీయం

సంగారెడ్డి టౌన్: వాసవీ మా ఇల్లు సంస్థ ఆధ్వర్యంలో 102 రోజుల పాటు సంగారెడ్డి పట్టణ ప్రజలకు తాగునీటి సరఫరా అందించడం అభినందనీయమని జ్యోతిర్ వాస్తు విద్యాపీఠం వ్యవస్థాపకుడు బ్రహ్మశ్రీ డాక్టర్ మహేశ్వరశర్మ సిద్ధాంతి అన్నారు. మంచినీటి సరఫరా ముగింపు కార్యక్రమాన్ని ఫసల్వాదిలోని ఆశ్రమంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భగా సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంస్థ ద్వారా మరిన్ని సేవా కార్యక్రమాలను చేపట్టాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వ్యవస్థాపకుడు తోపాజి అనంతకృష్ణ, ప్రధాన కార్యదర్శి ప్రకాష్, సభ్యులు కొంపల్లి విద్యాసాగర్, శ్రీహరి పాల్గొన్నారు.

వైకుంఠ రథం అందజేత



వైకుంఠరథాన్ని అందజేస్తున్న ఏవీఆర్ ఫౌండేషన్ ప్రతినిధులు

హత్నూర(సంగారెడ్డి): మండల పరిధిలోని కాసాల గ్రామానికి ఏవీఆర్ ఫౌండేషన్ చైర్మన్ శరత్‌చంద్ర శుక్రవారం వైకుంఠరథాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ ప్రతినిధి యాదయ్య మాట్లాడుతూ ఫౌండేషన్ ద్వారా అనేక సామాజిక సేవా కార్యక్రమాలను చేపడుతున్నట్లు తెలిపారు. అందులో భాగంగానే గ్రామానికి వైకుంఠరథాన్ని అందజేసినట్లు వివరించారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ ప్రతినిధులను గ్రామస్తులు, నాయకులు అభినందించారు.

బొగ్గుబావుల వేలాన్ని రద్దు చేయాలి



కలెక్టరేట్‌లో వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

సంగారెడ్డి టౌన్: కేంద్ర ప్రభుత్వం బొగ్గుబావుల వేలాన్ని రద్దు చేయాలని కార్మిక సంఘాల నాయకులు అన్నారు. ఈ మేరకు కార్మిక సంఘాల పిలుపుమేరకు కలెక్టరేట్ ఎదుట శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్‌ఓ పద్మజారాణికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బొగ్గుబావుల ప్రైవేటీకరణ ఆపాలని శ్రావణపల్లి బ్లాకును సింగరేణికి అప్పజెప్పాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా కేంద్రాన్ని గట్టిగా ప్రతిఘటించి బొగ్గు బ్లాకు సాధించాలన్నారు. వేలాన్ని వెంటనే ఆపాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లికార్జున్, ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు నరసింహారెడ్డి, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ప్రసాద్, సీఐటీయూ నాయకులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల బలోపేతమే లక్ష్యంగా..

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అడుగులు

- ఈ ఏడాది నుంచి చిన్నారులకు యూనిఫాం
- మహిళా సంఘాలకు తయారీ బాధ్యతలు
- జిల్లాలో అంగన్‌వాడీ చిన్నారుల సంఖ్య 10167



విద్యాబోధన చేస్తున్న అంగన్‌వాడీ ఉపాధ్యాయురాలు (ఫైల్)

అంగన్‌వాడీ కేంద్రాల బలోపేతానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కొత్త పథకాలను తీసుకువస్తున్నాయి. అంగన్‌వాడీ కేంద్రాల వద్ద చిన్నారులు, బాలింతలు, గర్భిణులకు పౌష్టికాహారం అందిస్తూ చిన్నారులకు ఆటలు, పాటలు, కథలు చెబుతూ ఆకట్టుకునే విధంగా ప్రీప్రైమరీ విద్యాబోధన చేపడుతున్నారు. కాగా ఈ విద్యా సంవత్సరం నుంచి అంగన్‌వాడీ చిన్నారులకు ఉచితంగా యూనిఫాంలు అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది.

– సంగారెడ్డి టౌన్

అంగన్‌వాడీ కేంద్రాల వివరాలు

జిల్లాలో ఉన్న 522 అంగన్‌వాడీ సెంటర్లలో 10167 మంది చిన్నారులను గుర్తించి ఐసీడీఎస్ అధికారులు ఉన్నతాధికారులకు నివేదికను అందజేశారు. గతం నుంచి సర్కార్ పాఠశాలల విద్యార్థులకు మాత్రమే ప్రభుత్వాలు ఉచితంగా పాఠ్యపుస్తకాలతో పాటు యూనిఫాం ఉచితంగా పంపిణీ చేసేవి. ఈ విద్యా సంవత్సరం నుంచి అంగన్వాడీ కేంద్రాలను ప్రీ ప్రైమరీ పాఠశాలలుగా మార్చే క్రమంలో మూడు నుంచి ఆరేళ్ల వయసు లోపు ఉన్న చిన్నారులకు ఉచితంగా యూనిఫాం అందించేందుకు ప్రభుత్వం అవసరమైన వస్త్రాల సామగ్రిని జిల్లా సంక్షేమ శాఖకు అందజేసింది.

మహిళా సంఘాలకు బాధ్యతలు అప్పగింత

అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారులకు యూనిఫాంలు కుట్టించి అందించే విధంగా మహిళా సంఘాలకు బాధ్యతలను అప్పగించారు. యూనిఫాంలకు సంబంధించిన డిజైన్లను ఎంపిక చేసి అందిస్తారు. మగ పిల్లలకు నిక్కర్, షర్టు.. ఆడపిల్లలకు ఫ్రాగ్ కుట్టాలని మహిళాశక్తి సంఘాలకు యూనిఫాం క్లాత్ అందించనున్నారు. మహిళా సంఘాలు విద్యార్థులకు యూనిఫాంలు కుట్టించడంతో పాటు ఆర్థిక భరోసా కలిగించే విధంగా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. జూలై చివరి నాటికి అంగన్‌వాడీ విద్యార్థులకు యూనిఫాంలు అందించవలసిన ఉన్నట్లు తెలుస్తోంది.



యూనిఫాం నమూనా

పిల్లల సంఖ్య పెంచే విధంగా చూస్తున్నాం



గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లల సంఖ్యను పెంచేవిధంగా చూస్తున్నాం. అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు యూనిఫాం కుట్టించేందుకు మహిళా సంఘాలకు అప్పగించాం. ఇప్పటికే ప్రభుత్వ పాఠశాల యూనిఫాంలు కుట్టడంలో కొంత ఆలస్యం అయింది. సంఘాలకు యూనిఫాం క్లాత్‌లు అందిస్తున్నాం. ఈ నెల చివరి లోపు ప్రతి అంగన్‌వాడీ చిన్నారులకు యూనిఫాంలు చేరేవిధంగా కృషి చేస్తాం.

– జిల్లా మహిళా శిశు సంక్షేమశాఖ అధికారి, లలితకుమారి

విధుల్లోకి తీసుకోవాలి

ఎస్‌జీ ఆర్గానిక్స్ పరిశ్రమ ఎదుట కార్మికుల ఆందోళన



ఆందోళన నిర్వహిస్తున్న కార్మికులు

హత్నూర(సంగారెడ్డి): గతంలో పరిశ్రమలో పనిచేసిన కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ మండల పరిధిలోని చందాపూర్ శివారులో ఉన్న ఎస్‌బీ ఆర్గానిక్స్ పరిశ్రమ ఎదుట కార్మికులు శుక్రవారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు కార్మికులు మాట్లాడుతూ పరిశ్రమలో నెల రోజుల క్రితం భారీ పేలుళ్లు సంభవించి ఐదు మంది మృతి చెందటంతో పాటు పరిశ్రమ యూనిట్ -1 భవనం పూర్తిగా ధ్వంసమైందన్నారు. దీంతో కొంతకాలంగా పరిశ్రమను నిర్వహించలేదన్నారు. ప్రస్తుతం పరిశ్రమ పనులు నిర్వహిస్తున్నందువల్ల గతంలో పనిచేసిన కార్మికులను తొలగించకుండా వెంటనే విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఏళ్ల తరబడిగా పరిశ్రమను నమ్ముకొని జీవిస్తున్న తమను విధుల్లోకి ఎందుకు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. ఇప్పటికైనా పరిశ్రమ యాజమాన్యంలో వెంటనే స్పందించి తొలగించిన కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్మికుల ఆందోళనకు స్థానిక నాయకులు మద్దతు తెలిపారు.

విద్యార్థినికి ఎంపీ సన్మానం



శివానీ తల్లిదండ్రులను సన్మానిస్తున్న ఎంపీ సురేష్ షెట్కార్

జహీరాబాద్: జహీరాబాద్‌కు చెందిన అంధ విద్యార్థిని శివానీ ఐఐఎంలో సీటు సాధించడంపై ఎంపీ సురేష్‌షెట్కార్ అభినందించారు. శుక్రవారం శివానీ ఇంటికి వెళ్లి ఆమె తల్లిదండ్రులు కొత్తకాపు విజయలక్ష్మి, గోపాల్‌రెడ్డిలను సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శివానీ పుట్టుకతో అంధురాలు అయినప్పటికీ ఎంతో ప్రతిభను కనబర్చి ఐఐఎంకు ఎంపిక కావడం గొప్ప విషయమని కొనియాడారు. ఎంపీ వెంట నాయకులు నర్సింహారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, అశోక్‌రెడ్డి, షాకీర్‌అలీ, సద్రుద్దిన్‌గౌరి, గుండారెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, నాగిరెడ్డి, శుక్లవర్ధన్‌రెడ్డి, నారాయణరెడ్డి, పుణ్యమ్మ, అతార్‌గౌరి, నరేష్‌గౌడ్ ఉన్నారు.

పారిశ్రామిక, విద్యారంగ అభివృద్ధికి కృషి



ఎంపీ సురేష్ షెట్కార్‌ను సన్మానిస్తున్న నాయకులు

జహీరాబాద్: జహీరాబాద్ ప్రాంతాన్ని పారిశ్రామిక, విద్యారంగంగా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని ఎంపీ సురేష్‌షెట్కార్ అన్నారు. శుక్రవారం రాత్రి పట్టణంలోని బసవ కాంప్లెక్సులో తెలంగాణ రికగ్నైజ్‌డ్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ (ట్రస్మా) ఆధ్వర్యంలో ఎంపీని ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జహీరాబాద్‌లో నిమ్జ్ ఏర్పాటుకాబోతున్న నేపథ్యంలో పారిశ్రామికంగా ఈ ప్రాంతం ఎంతో అభివృద్ధి చెందనుందన్నారు. యువతకు ఉపాధి అవకాశాలు కూడా లభిస్తాయని తెలిపారు. విద్యారంగం అభివృద్ధిలో భాగంగా ఇంజనీరింగ్ కళాశాలను ఏర్పాటు చేసే దిశలో ప్రయత్నాలు చేస్తానన్నారు. ప్రస్తుతం ఉన్న పాలిటెక్నిక్ కళాశాలకు అనుబంధంగా దీనిని ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ట్రస్మా సంఘానికి భవనం నిమిత్తం స్థలాన్ని కేటాయించేలా చూస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ట్రస్మా నాయకులు కె.దశరథరెడ్డి, క్రిష్టారెడ్డి, జి.మోహన్‌రెడ్డి, అయ్యప్పరెడ్డి, పి.శ్రీనివాస్‌రెడ్డి, ముజాయిద్, నాగన్న, చంద్రశేఖర్, శ్రీశైలం, గౌతమ్, సంతోష్, వెంకట్‌రాంరెడ్డి, సునిల్, స్వరాజ్, శేఖర్‌రెడ్డి, జనార్దన్‌రెడ్డి పాల్గొన్నారు.

వీధికుక్కలతో జనం బెంబేలు

- గుంపులుగా సంచారం
- భయాందోళనలో స్థానిక ప్రజలు
- వీధికుక్కల బెడదను అరికట్టాలని విజ్ఞప్తి



జహీరాబాద్ పట్టణంలో వీధి కుక్కల గుంపు

జహీరాబాద్ టౌన్: నియోజకవర్గంలోని ఆయా గ్రామాల్లో వీధికుక్కల బెడద రోజురోజుకు అధికమవుతోంది. దీంతో ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. వీధుల్లో గుంపులుగా సంచరిస్తూ చిన్నపిల్లలపై దాడులు చేస్తున్నాయి. మొగుడంపల్లి మండల కేంద్రంలో ఓ ఇంటి వద్ద ఆడుకుంటున్న అజాన్ అనే ఎనిమిదేళ్ల బాలుడిపై ఒక్కసారిగా దాడి చేసి తీవ్రంగా గాయపరిచాయి. మరుసటి రోజు పడియల్ తండాకు చెందిన విద్యార్థి చౌహాన్‌నరేష్ స్కూల్‌కు వస్తున్న క్రమంలో దాడి చేయగా.. అదేరోజు మొగుడంపల్లికి చెందిన నహీంను ఎల్లమ్మ ఆలయం వద్ద దాడి చేసి తీవ్రంగా గాయపరిచాయి. కోహీర్ మండల పరిధిలోని పిచరాగడి తదితర గ్రామాల్లోనూ వీధికుక్కల బెడద అధికంగా ఉంది. గుంపులుగా వీధికుక్కలు గ్రామాల్లో సంచరిస్తుండటంతో ప్రజలు భయాందోళకు గురవుతున్నారు.

జహీరాబాద్ మున్సిపాలిటీలో...

జహీరాబాద్ మున్సిపాలిటీలోనూ వీధికుక్కల బెడద రోజురోజుకు అధికమవుతోంది. వీధికుక్కల బెడదను నివారించాలని గతంలో ఫిర్యాదులు అందడంతో మున్సిపల్ అధికారులు కుక్కలు, పందులను పట్టుకుని ప్రత్యేక వాహనాల్లో తరలించారు. కానీ.. ఈ సంవత్సరం అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంతో పట్టణంలో ఎక్కడ చూసినా కుక్కల మంద గుంపులుగా కనిపిస్తోంది. ఈ విషయంపై ప్రతి రోజు మున్సిపల్ అధికారులకు ఫిర్యాదులు చేస్తున్నా పట్టించుకోవడం లేదని స్థానిక ప్రజలు వాపోతున్నారు. ఉన్నతాధికారులు వెంటనే స్పందించి వీధికుక్కల బెడదను నివారించాలని ప్రజలు కోరుతున్నారు.



వీధికుక్కల దాడిలో గాయపడిన నరేష్(ఫైల్)

డ్రంకెన్ డ్రైవ్‌లో జరిమానా

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు 13 మందిలో ఐదుగురికి రూ.2 వేల చొప్పున జరిమానా విధించగా మిగతా వారికి రెండు వేల జరిమానాతో పాటు జైలుశిక్ష విధించింది. పటాన్‌చెరు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ సీఐ లాలూ నాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. బుధ, గురువారాల్లో నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్‌లో 13 మందిని అదుపులోకి తీసుకొని శుక్రవారం కోర్టులో హాజరుపర్చగా జడ్జి 05 మందికి ఒక్కొక్కరికి రూ.2వేలు చొప్పున జరిమానా, ఒకరికి మూడు రోజులు, నలుగురికి రెండు రోజులు, ముగ్గురికి ఒక రోజు జైలుశిక్ష విధించినట్లు పేర్కొన్నారు.

మృతుల కుటుంబీకులకు ఎంపీ పరామర్శ



మృతుల కుటుంబీకులను ఓదార్చుతున్న ఎంపీ సురేష్‌షెట్కార్

నారాయణఖేడ్: ఇటీవల కారులో విహారయాత్రకు వెళ్లి తిరిగి వస్తుండగా మహారాష్ట్రలోని పూణె సమీపంలో చోటుచేసుకున్న రోడ్డు ప్రమాదంలో నారాయణఖేడ్ పట్టణానికి చెందిన మహబూబ్ ఖురేషి, రఫీక్ ఖురేషి అక్కడికక్కడే మృతి చెందిన విషయం తెలిసిందే.. ఈ నేపథ్యంలో జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కార్, మాజీ జెడ్పీ కో-ఆప్షన్ సభ్యులు రశీద్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తాహెర్ అలీ శుక్రవారం మృతుల ఇళ్ల వద్దకు వెళ్లి కుటుంబీకులను పరామర్శించారు. మంత్రి వెంట యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాకేష్ షెట్కార్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు నాగనాథ్, సంతోష్‌రెడ్డి, విఠల్ తదితరులు ఉన్నారు.

కాలుష్యం నుంచి బతికించండి

ఎంపీ రఘునందన్‌రావుకు వినతి

జిన్నారం(పటాన్‌చెరు): జిన్నారం మండలంలోని కాజిపల్లి గ్రామాన్ని కాలుష్యం నుంచి బతికించాలని కోరుతూ కాలుష్య నియంత్రణ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం మెదక్ ఎంపీ రఘునందన్ రావుకు వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా జేఏసీ చైర్మన్ దండే రమాకాంత్ మాట్లాడుతూ.. కాలుష్యాన్ని నియంత్రించే విషయంలో తాము చేపడుతున్న కార్యక్రమాలకు అన్ని వర్గాల ప్రజలు, నాయకుల నుంచి విశేష స్పందన వస్తుందన్నారు. రఘునందన్ రావుకు కాలుష్య సమస్యలు పూర్తిస్థాయిలో వివరించామన్నారు. కాలుష్యాన్ని నివారించడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి తీసుకురావాలని కోరినట్లు తెలిపారు. ఇందుకు ఎంపీ రఘునందన్ రావు సానుకూలంగా స్పందించారన్నారు. కార్యక్రమంలో జేఏసీ, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.



ఉపాధ్యాయులకు సన్మానం

ఝరాసంగం(జహీరాబాద్): మండల పరిధిలోని ఎల్గోయి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విధులు నిర్వహించి బదిలీ అయిన ఉపాధ్యాయులు శ్యామయ్య, రవికుమార్, తుకారం, పాండు, హనుమంతు, అపర్ణను గ్రామపెద్దలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు కలిసి ఘనంగా సన్మానించారు. అదేవిధంగా నూతనంగా బదిలీపై పాఠశాలకు వచ్చిన రవికుమార్, సాయిలు, మాధవిని సన్మానించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నాగేశ్వరరావు, ఉపాధ్యాయులు శోభారాణి, తుక్కప్ప, అంగన్వాడీ టీచర్లు, గ్రామపెద్దలు, యువజన సంఘాల నాయకులు పాల్గొన్నారు.



కరపత్రాలు విడుదల చేస్తున్న నాయకులు

నేడు బైక్ ర్యాలీ

జహీరాబాద్ టౌన్: పట్టణంలో 50 పడకల ఈఎస్ఐ ఆసుపత్రిని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ శనివారం బైక్ ర్యాలీ నిర్వహించనున్నట్లు సీఐటీయూ క్లస్టర్ కన్వీనర్ మహిపాల్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం బైక్ ర్యాలీ కరపత్రాన్ని విడుదల చేశారు. కార్యక్రమంలో మహీంద్ర అండ్ మహీంద్ర పరిశ్రమల ప్రధాన కార్యదర్శి రాజిరెడ్డి, నాయకులు గణేష్, వంశీకృష్ణ, సుధాకర్, మోహన్, మాణిక్, రాజు తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ జాబ్ క్యాలెండర్ విడుదల చేయండి

సంగారెడ్డి టౌన్: ఉద్యోగాల భర్తీకి జాబ్ క్యాలెండర్‌ను విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ బీజేవైఎం నాయకులు శుక్రవారం కలెక్టరేట్‌ను ముట్టడించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 25వేల టీచర్ పోస్టులతో మెగా డీఎస్సీ నిర్వహించాలన్నారు. అదేవిధంగా పోలీస్ కానిస్టేబుల్ నియామకాల్లో అభ్యర్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

◆ అప్రమత్తంగా ఉండాలి

జహీరాబాద్: వర్షాకాలం కావడంతో సీజన్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందునా వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని మల్‌చల్మ పీహెచ్‌సీ వైద్యుడు నవనీత్ అన్నారు. పీహెచ్‌సీలో వైద్య సిబ్బందితో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలంలో నీళ్ల విరేచనాలు, డెంగ్యూ, మలేరియా, పచ్చకామెర్లు తదితర వ్యాధులు సోకే ప్రమాదం ఉందన్నారు. దీంతో ఆశావర్కర్లు, వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ యాదుల్లా, సూపర్‌వైజర్ లలిత, ఎంఎల్‌పీహెచ్ మికెఫ్రాన్స్, సిబ్బంది పాల్గొన్నారు.

◆ బీజేపీ నాయకుల అరెస్టు

నారాయణఖేడ్: సంగారెడ్డిలోని కలెక్టరేట్ ముట్టడికి బీజేవైఎం రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపుమేరకు తరలి వెళ్తున్న ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలను పోలీసులు శుక్రవారం మార్గమధ్యలో అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా బీజేపీ మండల శాఖ అధ్యక్షుడు దశరథ్ మాట్లాడుతూ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే జాబ్ క్యాలెండర్ వేస్తామని చెప్పి జాప్యం చేస్తోందని మండిపడ్డారు. ఇప్పటికైన జాబ్ క్యాలెండర్ ప్రకటించాలని, లేనిపక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

◆ ఘనంగా శ్యాంప్రసాద్ ముఖర్జీ జయంతి



జోగిపేట (అందోల్): డాక్టర్ శ్యాంప్రసాద్ ముఖర్జీ జయంతిని పురస్కరించుకొని శుక్రవారం జోగిపేటలో బీజేపీ నాయకులు మొక్కలను నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరూ మొక్కలను నాటాలని సూచించారు. కార్యక్రమంలో ఆ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు ప్రభాకర్‌గౌడ్, నియోజకవర్గ మాజీ కన్వీనర్ ప్రభాత్‌కుమార్, కిసాన్ మోర్చా ఉపాధ్యక్షుడు మాణయ్య, మండల మాజీ అధ్యక్షుడు శ్యామాగౌడ్, నాయకులు జగన్నాథం, సతీష్, నర్సింలు, మహేందర్, నవీన్ పాల్గొన్నారు.

బొల్లారం మున్సిపల్ పరిధిలో...



జిన్నారం(పటాన్‌చెరు): బొల్లారం మున్సిపల్ పరిధిలో బీజేపీ నాయకులు శుక్రవారం ఆ పార్టీ జిల్లా నాయకుడు రవీందర్‌రెడ్డి ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ పార్టీ పిలుపు మేరకు మున్సిపల్ పరిధిలోని అన్ని కాలనీలో అధికసంఖ్యలో మొక్కలు నాటే విధంగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

◆ నిషేధిత గుట్కా ప్యాకెట్ల స్వాధీనం

జిన్నారం(పటాన్‌చెరు): బొల్లారం మున్సిపల్ పరిధిలో నిషేధిత గుట్కా ప్యాకెట్లను శుక్రవారం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఐ దశరథ్ తెలిపిన వివరాల ప్రకారం.. జ్యోతినగర్ కాలనీకి చెందిన కృష్ణదత్తు, దీనబంధు దత్తు చెందిన కిరాణంషాపులో నిషేధిత గుట్కాలను విక్రయిస్తున్నారు. విషయం తెలుసుకున్న పోలీసులు షాపులపై శుక్రవారం దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో రూ.69వేల విలువైన నిషేధిత గుట్కాలను స్వాధీనం చేసుకొని ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

◆ వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు

రాయికోడ్(అందోల్): వ్యక్తి అదృశ్యమైన సంఘటన శుక్రవారం చోటుచేసుకుంది. ఎస్ఐ వెంకట్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. శంషోద్దిన్‌పూర్ గ్రామానికి చెందిన విఠల్ తండ్రి మానయ్య జహీరాబాద్‌లో ఓ సంస్థలో జేసీబీ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. అనారోగ్యంతో నాలుగు రోజుల క్రితం స్వగ్రామానికి వచ్చి ఇంటి వద్దే ఉంటున్నారు. గురువారం సాయంత్రం పొలం వద్ద నుంచి ఇంటికి వచ్చి ఇంటిపైన పడుకున్నాడు. ఈ క్రమంలో రాత్రి 9గంటలకు ఆయన భార్య ఇంటిపైకి వెళ్లి చూడగా కనిపించలేదు. దీంతో మానయ్య కోసం ఎంత వెతికినా ఆచూకీ లభించకపోవడంతో అతని కుమారుడు శ్రీకాంత్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

◆ మానికకు సన్మానం

కల్హేర్(నారాయణఖేడ్): ట్రిపుల్ ఐటీకి ఎంపికైన విద్యార్థిని మౌనికను శుక్రవారం కల్హేర్ ఉన్నత పాఠశాలలో ఘనంగా సన్మానించారు. మండలంలోని ఇందిరానగర్ తండాకు చెందిన మౌనికకు 10వ తరగతిలో 9.8 జీపీఏ సాధించింది. దీంతో ట్రిపుల్ ఐటీలో సీటు వచ్చిందని హెచ్‌ఎం శ్రీనివాస్ పేర్కొన్నారు. కార్యక్రమంలో టీచర్లు సంజీవ్‌కుమార్, గుండు గోవర్ధన్, హన్మండ్లు, శైలజకులకర్ణి, కౌసల్య పాల్గొన్నారు.

◆ డీజిల్ తరలిస్తున్న వాహనం సీజ్

మునిపల్లి(అందోల్): అక్రమంగా డీజిల్ తరలిస్తున్న ఆటోను పోలీసులు సీజ్ చేశారు. బుదేరా ఏఎస్ఐ భిక్షపతి తెలిపిన వివరాల ప్రకారం.. కర్నాటక రాష్ట్రం నుంచి ఆటోలో 560 లీటర్ల డీజిల్‌ను మూడు డ్రమ్ములలో తీసుకువస్తున్నారు. విషయం తెలుసుకున్న సివిల్ సప్లై డిప్యూటీ తహసీల్దార్ స్వప్న ఆటోను స్వాధీనం చేసుకొని పోలీస్‌స్టేషన్‌లో అప్పగించించారు. మునిపల్లి మండలంలో మైనింగ్‌లో పనిచేస్తున్న ఇటాచీ, లారీలకు డీజిల్‌ను విక్రయిస్తున్నట్లు గుర్తించారు. ఆటోడ్రైవర్ విజయ్‌పై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

◆ భగీరథ నీటి నాణ్యత పరిశీలన

శివ్వంపేట(నర్సాపూర్): గ్రామీణ ప్రాంత ప్రజలకు సరఫరా చేస్తున్న మిషన్ భగీరథ నీటి నాణ్యతను జై జీవన్ మిషన్ సంస్థ ప్రతినిధులు శుక్రవారం పరిశీలించారు. మండల పరిధిలోని శభాష్‌పల్లిలో నల్లాల ద్వారా సరఫరా అవుతున్న నీటిని పరిశీలించి నమూనాలను సేకరించారు. ప్రతి ఇంటికీ నల్లా కనెక్షన్, నీటి సరఫరా తదితర విషయాల గురించి గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. జై జీవన్ మిషన్ సభ్యులు శ్రీనివాస్, ఆంజనేయులు, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ లక్ష్మీప్రసాద్ పాల్గొన్నారు.